క్లుప్తంగా

ఆధిపత్య పోరుతో అభివృద్ధి పనులకు ఆటంకం

ఓబులవారిపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆధిపత్య పోరుతో అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోందని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య అన్నారు. వైకోట గ్రామంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ ఆరు నెలలు గడచినా జనసేన, టీడీపీ నాయకుల మధ్య వివాదంతో పనులు జరగడం లేదన్నారు. వైకోట– గుండాల కోన రహదారి పనులు నిలిచిపోయాయని, ఈ నెల 20వ తేదీలోగా ప్రారంభించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొమ్మెద్దుల వేంకటరమణ, కడియాల చిన్నయ్య, మేకల మురళి, బిగాల సుధా నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాక

రాయచోటి (జగదాంబసెంటర్): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం అన్నమయ్య జిల్లా రాయచోటికి ఆదివారం రానున్నట్లు జిల్లా అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు విజయవాడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు రాయచోటి పట్టణం లోని తమ క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారన్నారు. అనంతరం మంత్రి ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

వాచ్‌మెన్లకు వేతనాలు చెల్లించాలి

పుల్లంపేట: పుల్లంపేట మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్లకు ఐదు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని అన్నమయ్య జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఉమా మహేశ్వర్‌నాయక్ ఓ ప్రకటనలో కోరారు. వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

15లోపు మామిడి పంటకు బీమా చేయించండి

లక్కిరెడ్డిపల్లి: డిసెంబర్ 15వ తేదీలోగా మామిడి రైతులు పంటల బీమా చేయించుకోవాలని బీమా అధికారి ఇర్షాద్ అలీ తెలిపారు. లక్కిరెడ్డిపల్లి మండలం దప్పేపల్లి, కోనంపేట పంచాయతీల్లో మామిడి రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు పంటల బీమా పథకాల ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న సాంబశివ తదితరులు

మదనపల్లి : కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.సాంబశివ తెలిపారు. అన్నమయ్యజిల్లా కేంద్రం రాయచోటిలో డిసెంబర్ 20వ తేదీన జరగనున్న ఏఐటీయూసీ జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫలమైందన్నారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్, ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, జిల్లా ఉపాధ్యక్షుడు దేవా, యూనియన్ నాయకులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు వేతనాలు

మదనపల్లి : మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు లేబర్ కమిషనర్ 23 నెలల వేతనాలు మంజూరు చేశారని మదనపల్లె స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్ ఎఫ్–100 ప్రెసిడెంట్ జే.వి.నరసింహమూర్తి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2014లో మిల్లు యాజమాన్యం కార్మికులకు తెలపకుండా మిల్లును మూసివేసిందన్నారు. స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు రావాల్సిన బకాయిల విషయమై యూనియన్ చేసిన పోరాటాలకు ఎట్టకేలకు కదలిక వచ్చిందన్నారు. ఇల్లీగల్ లాకౌట్‌కు సంబంధించి కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలను విజయవాడ లేబర్ కమిషనర్ మంజూరుచేశారని తెలిపారు.

గరుడ వాహనంపై వెంకన్న

మదనపల్లె సిటీ: పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం గరుడ వాహనంపై వెంకన్న పురవీధుల్లో విహరించారు. ఆలయంలో స్వామికి అర్చకులు గోవర్ధన్ భట్టార్ ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వాహనంలో స్వామిని గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆర్‌యూబీలో రాకపోకలకు ఆటంకం

వందల వాహనాలు రాకపోకలు సాగించే ఆ మార్గం మూసుకుపోయింది. ఉన్న పాటుగా కాల్వ నీరు రైల్వే అండర్ బ్రిడ్జికి చేరడమే ఇందుకు కారణం. మోటార్లతో నీటిని ఎత్తిపోయాల్సిన నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో పెద్ద ఎత్తున రైళ్లు తిరిగే మార్గంలో రైల్వే గేట్ దాటుకుని వెళ్లేందుకు జనం అపసోపాలు పడ్డారు.

- గేట్ క్లోజింగ్‌తో సమస్య తీవ్రం
- వాహనాల రాకపోకలకు అంతరాయం
- కన్యక చెరువు కాల్వలోకి వరద నీరు
- నీటితో నిండిపోయిన ఆర్‌యూబీ
- పట్టించుకోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ

రాజంపేట: నందలూరులో ఆర్‌యూబీ(రోడ్‌అండర్‌బ్రిడ్జి)వద్ద రాకపోకలకు నిత్యం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వర్షం కురిస్తే చాలు నీరు చేరడంతో ఇంజినీరింగ్ అధికారులు గేటు పెట్టి తాళాలు వేస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఇదిలా ఉంటే ఇటీవల చెయ్యేరు నీటిని కన్యకల చెరువుకు మళ్లించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు కాల్వ పనులు చేపట్టారు. అయితే ప్రధాన కాలువలో నీటి ఉధృతి పెరిగింది. కాల్వలో నీరు పొంగి ప్రవహించడంతో మళ్లీ ఆర్‌యూబీలోకి చేరింది. ఆర్‌యూబీలో నీరు ఉండడంతో వాహనదారులు ఆ మార్గంలో వెళ్తే ప్రమాదాల బారిన పడడం జరుగుతుంది. దీంతో ముందస్తుగా నందలూరు రైల్వే అధికారులు ఆర్‌యూబీకి తాళాలు వేస్తున్నారు. సమస్య తీవ్రమవుతోంది.



కన్యకల చెరువు ప్రధానకాలువలోని నీరు ఆర్‌యూబీలోకి చేరుతోందిలా..

గేట్లు ఎత్తివేసి.. ఆర్‌యూబీల నిర్మాణం

ముంబయి–చెన్నై మార్గంలోని ఉభయ జిల్లాల పరిధిలో గతంలో మనిషి కాపాలా లేని గేట్లు, మనిషి ఉండే గేట్లు ప్రకా/రం రెండు రకాల విధానం రైలు మార్గం వెంబడి ఉండేది. అయితే గేట్ల సంఖ్య తగ్గించేందుకు ఇటీవల రైల్వే, ఆర్‌అండ్‌బీ సంయుక్తంగా ఆర్‌యూబీల నిర్మాణం చేపట్టాయి. పెద్ద పెద్ద పట్టణ ప్రాంతాల్లో ఆర్వోబీల నిర్మాణం జరుగుతోంది. అయితే ముందుచూపు లేకుండా నిర్మించిన ఆర్‌యూబీల్లోకి వర్షాలు కురిస్తే చాలు.. నీరు చేరుతోంది. ఒకవైపు గేటు లేక, ఆర్‌యూబీ మూతపడడ వంటి కారణాలతో జనం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నందలూరు గేట్ వద్ద ఇక్కట్లు

ఉభయ జిల్లాలోని రైలు మార్గంలోని ఏ స్టేషన్‌లో లేని విధంగా విశాలమైన రైల్వే యార్డు లైన్లు ఉన్నాయి. 25 గూడ్స్ రైళ్లు, రోజుకు 13 అప్, 13 డౌన్ లైన్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రైల్వే మార్గం దాటేందుకు నందలూరు రైల్వే గేట్ ఉంది. పెద్ద ఎత్తున రైళ్లు వెళ్తుండడంతో ఇది ఒకసారి తెరవడం, మళ్లీ మూసివేయడం కోసం దాదాపు పది నిమిషాలు పడుతోంది. ఈ పరిస్థితిలో నాగిరెడ్డిపల్లె డీఎంసీ రోడ్డులో నిత్యం రాకపోకలు సాగించే 200 బైకులు, 30 ఆటో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు గేట్ మూయడం, మరోవైపు ఆర్‌యూబీకి తాళాలు వేయడంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది.

పట్టించుకోని మేజర్ పంచాయతీ

నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీలో సమస్యలు పడకేశాయి. ఇంటి పన్ను, నీటి పన్ను, ప్లాన్ అప్రూవల్, కొత్త ఇళ్ల నిర్మాణాలపై దృష్టి పెట్టే అధికారులు ప్రజల సమస్యలు పట్టించురకోవడం లేదు. ఆర్‌యూబీ సమస్య నెట్టివేసి తమకెందుకులే అన్నట్లు ఇటు నీటిపారుదలశాఖ, అటు ఆర్‌అండ్‌బీ కూడా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయి. దీనికి తోడు నాగిరెడ్డిపల్లె పంచాయతీ అధికారులు మోటార్ పెట్టి నీరు కాల్వలోకి పంపే పనులు చేపట్టడం లేదు. దీంతో జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు వివిధ ప్రాంతాల నుంచి కక్షిదారులకు ఈ సమస్య ఇబ్బంది కలిగిస్తోందస్కిక ఎంఈఓ కార్యాలయం, రైల్వే రన్నింగ్‌రూం, రైల్వే హాస్పిటల్, రైల్వే కళ్యాణ మండపం, రైల్వేక్వార్టర్స్‌లతోపాటు నాగిరెడ్డిపల్లె అర్బన్ ప్రాంతం, చెయ్యేటి చివరి గ్రామం తొగురుపేట వరకు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో నిత్యం ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ముమ్మరంగా ఉంటాయి.



నందలూరు-పాటూరు రైల్వేగేటు మూసివేయడంతో నిలిచిపోయిన వాహనాలు

సమస్య పరిష్కరించే నాథుడే కరవు



పేరుకు నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ. ప్రజల సమస్యలను పరిష్కరించే నాథుడే కరవయ్యారు. ఆర్‌యూబీలోకి నీళ్లు వచ్చేశాయి. వాటిని మోటారుతో మళ్లించి రాకపోకలు సుగమం చేసేవారు లేరు. అక్కడ ప్రమాద స్థితిలో నీరు చేరడంతో రైల్వే అధికారులు ముందు చూపుగా గేటువేసి తాళాలు వేశారు. వందలాది వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.

–జుల్ఫీకర్, హెచ్‌ఆర్‌పీఎస్ మైనార్టీనేత, నందలూరు

ఆర్‌యూబీలో నీటిని తొలగించాలి



నీరు చేరికతో ఆర్‌యూబీని క్లోజ్ చేశారు. వందలాది వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు. కన్యకల ప్రధాన కాలువలో ప్రవాహంతో ఆర్‌యూబీకి నీరు చేరుతోంది. అధికారులు స్పందించి ఇబ్బందులు లేకుండా చేయాలి

–చొప్పా నరసింహారెడ్డి, రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి, నాగిరెడ్డిపల్లె

రాజీ మార్గమే రాజమార్గం



లోక్ అదాలత్‌లో జూనియర్ సివిల్ జడ్జి ఫైజున్నీషా

లక్కిరెడ్డిపల్లి: రాజీ మార్గమే రాజమార్గమని లక్కిరెడ్డిపల్లి సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీషా అన్నారు. లక్కిరెడ్డిపల్లి కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ జరిగింది. జడ్జి మాట్లాడుతూ భూ తగాదాలు, చిన్న చిన్న గొడవలు, ఇంటి స్థలాల సమస్యలు గ్రామంలోనే పరిష్కరించుకోవాలన్నారు. ప్రతిసారీ పోలీస్ స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగరాదని కక్షిదారులకు సూచించారు. గతంలో పరిష్కారం కాని సివిల్ కేసులు, బ్యాంకుల మొండి బకాయిల సమస్యలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. 83 కేసులకుగాను రూ. 7,64,840లు నగదును పరిష్కారమైనట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎంఎల్.రామచంద్రారెడ్డి, రెడ్డన్న, చెన్న కృష్ణయ్య, కోర్టు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వంద కేసుల పరిష్కారం

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో జరిగిన లోక్ అదాలత్‌లో వంద కేసులు పరిష్కారమయ్యాయి. రూ. 32,55,690 రికవరీ చేశారు. కడప మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సిద్దవటం, అట్లూరు, ఒంటిమిట్ట పోలీసు స్టేషన్ల పరిధిలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. వంద కేసులు పరిష్కారం కాగా, ఏడు ఐపీసీ కేసుల నుంచి రూ.24 లక్షలు, ఒక ఈపీ కేసు నుంచి రూ.7 లక్షలు, 50 ఏపీ ప్రొహిబిషన్ యాక్ట్ కేసులనుంచి రూ.10 వేలు, 16 ఎస్‌టీసీ, సీసీ అడ్మిషన్ కేసుల నుంచి రూ. 63,700, 21 సీసీ అవార్డు కేసుల(ఎక్సైజ్ యాక్టు) నుంచి రూ.81,990 రికవరీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, ఎక్సైజ్ సిబ్బంది, పోలీసులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యం మెరుగుపరుస్తాం

జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం



మాట్లాడుతున్న డీఈఓ సుబ్రహ్మణ్యం

రాయచోటి(జగదాంబసెంటర్): విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డు మార్గంలోని అర్చన విద్యా సంస్థలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు పునాది అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రం ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్)పై చేపట్టిన ఆరు రోజుల శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి హాజరైన డీఈఓ మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థి అభ్యసనా సామర్థ్యాల పెంపు లక్ష్యంగా ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఉపాధ్యాయులు సమర్థవంతమైన విధానాలతో బోధన అందించేందుకు దృష్టి సారించాలన్నారు. శిక్షణలో తరగతి గది వ్యూహాలు, వినూత్న బోధనా పద్ధతులు, విద్యార్థుల నిశితత్వ పరిశీలన పెంపొందించేందుకు ఉపయోగపడుతుందన్నారు. రాబోయే పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంపై మార్గనిర్దేశం చేస్తామన్నారు. అధునాతన సమస్య–పరిష్కార పద్ధతులు, సమర్థవంతమైన పరీక్షల తయారీ కోసం చిట్కాలు, విద్యార్థుల పనితీరును మెరుగుపరిచే అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. విద్యా సంస్థలో సోమవారం నుంచి 200 మంది ఉపాధ్యాయులకు మరో విడత శిక్షణ ఇస్తున్నామన్నారు. అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల నుంచి 171 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారన్నారు. అనంతరం శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. కోలాటం, ఆటల పోటీలు, పాటల రూపంలో బోధనపై ఉపాధ్యాయులు సాధన చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఏఎంఓ సమీవుల్లా, శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడికి నిరసనగా ర్యాలీ



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న పాత్రికేయులు



సీఐ ఎల్లమరాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు

రాజంపేట టౌన్: కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులు అక్షరంపై దాడులకు తెగబడడ సిగ్గుచేటు అని పాత్రికేయులు ధ్వజమెత్తారు. నీటిసంఘం ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్ జిల్లా వేములలో పాత్రికేయులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీడబ్ల్యూజే రాజంపేటశాఖ, రాజంపేట ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు రాజంపేట పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి.. నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఏపీడబ్ల్యూజే రాజంపేటశాఖ అధ్యక్షుడు ఐసీ.వెంకటరెడ్డి, రాజంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బచోటి భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా ఉన్న జర్నలిస్టులపై దాడులు చేయడం అత్యంత దారుణమన్నారు. ప్రభుత్వం ఉదాసీనతతోనే జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులు స్వేచ్ఛగా విధులు నిర్వర్తించ లేని పరిస్థితి ఉందని, మరోమారు ఈ సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఎంతైనావుందని తెలిపారు. దాడులకు పాల్పడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎల్లమరాజుకు జర్నలిస్టులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కళాంజలి, మలిశెట్టి సుబ్బనరసింహులు, మోడపోతుల రామ్మోహన్, రవిచంద్రప్రసాద్, విక్రమ్, గణేష్, రాయులు, కల్యాణ్, ఓబులేసు, అలీషేర్, కార్తీక్, మందా శివయ్య, సునీల్, కుమార్, శ్రీహరి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయం

గాలివీడు: వైఎస్సార్ జిల్లా వేముల మండల కేంద్రంలో సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజ్‌కు వెళ్లిన సాక్షి జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైన చర్య అని గాలివీడు మండల విలేకరులు అన్నారు. దాడికి నిరసన తెలుపుతూ డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్‌రెడ్డికి శనివారం వినతిపత్రం సమర్పించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి డిమాండ్ చేశారు.

చెత్త నిల్వలు పేరుకుపోయి దుర్గంధం



మాధవరం-1 పంచాయతీలో చెత్తాచెదారం

సిద్దవటం: మండలంలోని మాధవరం–1 పంచాయతీలో చెత్తా, చెదారం పేరుకు పోయింది. రోడ్డు నెంబర్–13లోని పాత పంచాయతీ కార్యాలయం వెనుక, భద్రావతి భావనారాయణస్వామి ఆలయ ఆవరణంలో చెత్త తొలగించకపోవడంతో నిల్వలు పేరుకుపోయి కంపు కొడుతోంది. దోమలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని జనం ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెత్త తొలగించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో అయ్యప్పస్వామి

మదనపల్లె సిటీ: స్థానిక అయ్యప్పనగర్‌లో వెలిసిన అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని రంగు రంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంలో పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో ఉదయం గణపతి హోమం నిర్వహించారు. గ్రామోత్సవం సొసైటీ కాలనీ, పటేల్‌రోడ్డు, సీటీఎం రోడ్డు, నెహ్రూబజార్, బెంగళూరు బస్టాండు మీదుగా ఆలయం వరకు సాగింది. అయ్యప్పమాలాధారులు, కళాకారులు చేసిన భజనలు ఆకట్టుకున్నాయి. స్వామిని దర్శించుకుని టెంకాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. హెలిపింగ్‌మైండ్స్ సంస్థ అయ్యప్పమాలాధారులకు నిమ్మరసం అందజేశారు.

భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి ఉత్సవ కమిటీ సభ్యులు మార్పూరి సుధాకర్‌నాయుడు, విజయలక్ష్మి భాస్కర్, జర్మన్‌రాజు, భగవాన్, బాలకృష్ణ, కేశవ, ఆంజనేయులు, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఏకపక్షం.. ఏకగ్రీవం

నీటి సంఘాల ఎన్నికలను వైఎస్‌ఆర్‌సీపీ బహిష్కరించడంతో ఏకపక్షంగా సాగిపోయింది. అధికార పార్టీ నాయకులు ఒక్కటిగా చేరి తమ మద్దతుదారులను చైర్మన్, వైస్‌చైర్మన్‌గా ప్రకటించుకుని ఏకగ్రీవం చేసుకున్నారు. ఎన్నికలు జరగకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు.



వీరబల్లి నీటిసంఘం ఎన్నికల కేంద్రం వద్ద గుమికూడిన ప్రజలు, రైతులు

రాజంపేట రూరల్: మండలంలో శనివారం నిర్వహించిన ఏడు నీటి సంఘాలకు చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మన్నూరు సీఐ మహమ్మద్‌అలీ బందోబస్తు నిర్వహించారు. ఇరిగేషన్ ఏఈ మధుసూదన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఎన్నికైన వారికి డిక్లరేషన్ పత్రాలను సంబంధిత పీఓలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరబల్లి ఎన్నిక వాయిదా

వీరబల్లి: మండలంలోని వీరబల్లిలోని కోమటి చెరువు నీటి సంఘం ఎన్నికలు శనివారం వాయిదా పడ్డాయి. ఉదయం నుంచి ప్రజలు, రైతులు ఇరు వర్గాల నాయకులు అక్కడికి తరలివచ్చారు. ఇరు వర్గాల నాయకుల మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్త పరిస్థితి నెలకొనడం, అధ్యక్ష పదవికి పోటీ చేసిన అభ్యర్థుల అర్హతా పత్రాలు సరిగా లేకపోవడంతో వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. ఘర్షణకు దారి తీసే అవకాశం ఏర్పడటంతో రూరల్ సీఐ వరప్రసాద్, స్థానిక ఎస్ఐ మోహన్ నాయక్, పోలీసులు ఇరువర్గాల వారికి నచ్చచెప్పి పంపించేశారు. ఎన్నికలు తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారన్నది తెలియాల్సి ఉంది.

చిట్వేలి: మండలంలోని 9 ఆయకట్టు సంఘాలకు చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఒంటిమిట్ట(సిద్దవటం): మండలంలోని నాలుగు నీటి వినియోగదారుల సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. నాలుగు సంఘాల చైర్మన్‌లు, వైఎస్ చైర్మన్లు ఏకగ్రీవం అయ్యారు. ఒంటిమిట్ట నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో ఐదో ప్రాదేశిక బూత్ వద్ద ఉదయాన్నే ఇరువర్గాల వారు వాగ్వాదం చేసుకుని తోపులాడుకోగా.. పోలీసులు అప్రమత్తమై బయటకు పంపేశారు. ఇక్కడ రైతు చిన్నపోలు వెంకట్రామిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికై య్యారు. ఎన్నికల అధికారులు డిక్లరేష్ పత్రాలు అందజేశారు.

12 చెరువులకు సంఘాలు

పుల్లంపేట: మండలంలో నీటిసంఘం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు తహసీల్దారు అరవింద కిషోర్ తెలిపారు. మండలంలో 12 చెరువులకు చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నందలూరు: మండలంలో నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 13 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా 12 చోట్ల చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూకినేనిపల్లి స్ప్రింగ్ ఛానల్‌కు ఎన్నికలు జరిగాయి.

సంబేపల్లె: మండలంలోని శెట్టిపల్లె, రేకులకుంట చెరువులకు నీటి సంఘం ఎన్నికలు జరిగాయి. చైర్మన్, వైఎస్ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

చిన్నమండెం: చిన్నమండెం మండలంలోని కేశాపురం, టి.చాకిబండ గ్రామాల నీటి సంఘం ఎన్నికలను శనివారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు మంత్రి సతీమణి మండిపల్లి హరితమ్మ తెలిపారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. మండల అధికారులు ఎన్నికలను పర్యవేక్షించారు.

ఇండ్లూరులో నామినేషన్ నిల్

పెనగలూరు: మండలంలోని ఐదు చెరువులు, పది స్ప్రింగ్ ఛానల్‌లకు శనివారం నీటి సంఘం ఎన్నికలు జరిగాయి. 14 సంఘాలు ఏకగ్రీవంగా కాగా, ఇండ్లూరు స్ప్రింగ్ ఛానల్‌కు ఒక నామినేషన్ దాఖలు కాలేదు. దీంతో ఇండ్లూరు నీటి సంఘం ఎన్నిక వాయిదా పడింది.

రామాపురం: మండలంలోని చిట్లూరు పెద్దచెరువు, కల్పనాయునిచెరువు పెద్దచెరువు, హసనాపురం పెద్ద చెరువు నీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయని మండల ఎన్నికల అధికారులు రామాంజనేయులు, రామ కృష్ణుడు, జాషువా, నాగమణిలు తెలిపారు. మూడు నీటి సంఘాల చైర్మన్, వైఎస్ చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కూటమి నేతల మధ్య వర్గ పోరు

- రాజంపేట నియోజకవర్గంలో భగ్గుమన్న విభేదాలు
- పింఛా ఎన్నికల కేంద్రాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్

సుండుపల్లె: మండలంలోని పింఛా ప్రాజెక్టు, నాలుగు చెరువులకు నీటి సంఘం ఎన్నికల్లో కూటమి నేతల మధ్య వర్గ విభేదాలు బయటపడ్డాయి. పింఛా ప్రాజెక్టు నీటి సంఘం ఎన్నికను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారీ బందోబస్తు నడుమ నిర్వహించారు. ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఉదయం నామినేషన్ల ప్రక్రియ నుంచే సుగవాసి బాల సుబ్రహ్మణ్యం, జగన్‌మోహన్ రాజు వర్గాల మధ్య వాగ్వాదం మొదలైంది. పరస్పరం గొడవ పడుతుండటంతో టీసీ రూములో అధికారులు, ఓటర్లు మాత్రమే ఉండాలని పోలీసులు తెలిపారు. దీంతో ఓ వర్గంలోని కార్యకర్తలు కొందరు పోలీసు ఉన్నత స్థాయి అధికారితో దురుసుగా ప్రవర్తించి వాగ్వాదానికి దిగారు. ఎన్నికల అధికారి సుధాకర్ రెడ్డి ఈ విషయాన్ని పైఅధికారులకు తెలపడంతో రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, చిన్నమండెం ఎస్ఐ సుధాకర్, వీరబల్లి ఎస్ఐ మోహన్‌నాయక్ సిబ్బంది కేంద్రానికి వచ్చి బందోబస్తు నిర్వహించారు. విషయం తెలుసుకున్న రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి ఎన్నికల కేంద్రాన్ని సందర్శించి ఇరువర్గాల నాయకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ప్రాజెక్టు జల వనరులశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటరామయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేంద్ర నాయక్, తదితరులు ఇరువర్గాల నాయకులతో చర్చించి ఎన్నికను వాయిదా వేశారు. మిగిలిన నాలుగు చెరువులకు నీటి సంఘాల ఎన్నికలు జరపగా చైర్మన్, వైస్ చైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వైకోట నీటి సంఘం ఎన్నికలో ఉద్రిక్తత



వైకోట పోలింగ్ కేంద్రం వద్ద గుమిగూడిన కూటమి నాయకులు

ఓబులవారిపల్లె: రైల్వేకోడూరు నియోజకవర్గంలో నీటి సంఘం కాసేపు ఉద్రిక్తతకు దారితీసింది. వైకోటలో జరిగిన ఎన్నికల్లో కూటమి నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి వాగ్వాదానికి దిగారు. మాజీ సర్పంచ్ ఎ.బాలాజీ, బొక్కసం చలపతి వర్గాల మధ్య అధిపత్య పోరు బయటపడింది. ఎన్నిక నిర్వహించరాదని ఓ వర్గం, జరగాలని మరో వర్గం పట్టుబట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. రైల్వేకోడూరు రూరల్ సీఐ వేంకటేశ్వర్లు, ఎస్ఐ మహేష్ వారి మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించారు. అయినా ససేమిరా అంటూ ఎవరూ నామినేషన్ వేయకుండానే వెళ్లిపోయారు.